
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రేపు సీడీఎంఏ గౌతమ్ రాక

కరీంనగర్ టౌన్, ఆగస్టు 31: కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) గౌతమ్ సోమవారం కరీంనగర్‌లో పర్యటిస్తారు. డంపింగ్ యార్డులో నిర్వహిస్తున్న బయోమైనింగ్‌ను ఆయన పరిశీలిస్తారు. కరీంనగర్, వరంగల్ జిల్లా మధ్య పవర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసి రెండు నగర పాలక సంస్థల్లో వెలువడుతున్న చెత్తతో విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా సీడీఎంఏ గౌతమ్‌డంపింగ్‌యార్డును, డీఆర్సీలను పరిశీలిస్తారు. తడి, పొడిచెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ, వీధికుక్కలకు శస్త్ర చికిత్సలు చేయడం వంటి వాటిని పరిశీలిస్తారని తెలిసింది.

ఆశల సాగు

- పత్తి పంటకు అనుకూలంగా వాతావరణం
- ఏపుగా పెరుగుతున్న మొక్కలు
- చీడపీడల బెడద ఈసారి తక్కువే



హుజూరాబాద్, ఆగస్టు 31: ఈ వానకాలంలో పత్తి పంటకు అనుకూలంగా వర్షాలు కురుస్తున్నాయి. హుజూరాబాద్ డివిజన్‌లో పత్తి పంట సాగు చేస్తున్న రైతుల్లో ఆశలు మొదలయ్యాయి. ఆరుతడి పంట అయినా పత్తికి అవసరమైన ట్లు వర్షాలు అడపాదడపా కురుస్తున్నాయి. ఇది పత్తి పంటకు కలిసివస్తోంది. పత్తి గింజలు విత్తినప్పటి నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో చీడపీడల బెడద లేకుండా ఏపుగా పెరుగుతూ ప్రస్తుతం పూత దశలో ఉంది. ఇదే విధంగా దసరా వరకు వర్షాలు కొనసాగితే పత్తి పంట మంచి దిగుబడి వస్తుంది. పత్తిని చూసిన రైతులు, వ్యవసాయాధికారులు మంచి ధర లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి వాతావరణం అనుకూలించడంతో రెట్టింపు ఉత్సాహంతో రైతులు పత్తి పంటపై సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా గులాబీ, చీడ పురుగులు రాకుండా ఎప్పటికప్పుడు నివారణ చర్యలు తీసుకుంటున్నారు.

● సుమారు 60వేల ఎకరాల్లో పత్తి సాగు...

హుజూరాబాద్ డివిజన్‌లో జమ్మికుంట, హుజూరాబాద్, ఇల్లందకుంట, వీణవంక, శంకరపట్నం, సైదాపూర్ మండలాలు ఉన్నాయి. ఇందులో వరి పంట తర్వాత పత్తి పంటను రెండో స్థానంలో సాగు చేస్తున్నారు. మొదట్లో ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఆ తర్వాత వర్షాలు కురవడంతో రైతులు పత్తి పంటలో కలుపు మొక్కలు ఏరివేసి గుంటుకలు కొట్టారు. డివిజన్‌లో సుమారు 60వేల ఎకరాల్లో పత్తి సాగు అవుతోంది. గత ఏడాది ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో రైతులు కొంత మేర నష్టపోయారు. ఈ సారి వర్షాలు కురుస్తుండడంతో రైతులు పత్తి పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. గత ఏడాది పత్తి క్వింటాల్‌కు కేంద్రం మద్దతు ధర 7,020 రూపాయలు ప్రకటించగా ఈ ఏడాది అదనంగా 501 రూపాయలు పెంచింది. ప్రస్తుతం క్వింటాల్ పత్తికి మద్దతు ధర 7,521 రూపాయలు ఉంది. క్వింటాల్‌కు 10 వేల మద్దతు ధర ఉంటే లాభదాయకంగా ఉంటుందని రైతు సంఘాల నాయకులు అంటున్నారు.ఆరుతడి పంట అయినా పత్తికి ఈ సారి వాతా వరణం అనుకూలంగా ఉంది. వర్షాలు పడుతూ, ఎండలు కొడుతుండ డంతో పత్తి పంట ఏపుగా పెరిగింది. వర్షం ఎక్కువ కురిస్తే మొక్కలు ఎరుపు రంగుకు మారడంతోపాటు, పురుగులు ఆశిస్తాయి. ఈసారి అలాంటి పరిస్థితి లేకపోవడంతో రైతులు పూత కోసం మందులను పిచికారి చేస్తున్నారు. మరో నెల రోజుల పాటు వాతావరణం ఇలాగే ఉంటే పత్తి రైతుకు దిగుబడి చేతికి వచ్చే అవకాశం ఉన్నాయి.

రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

- సునీత, ఏడీఏ, హుజూరాబాద్



ఈ సారి పత్తి పంటకు అనుకూలంగా వాతావరణం ఉంది. ఇప్పటి వరకు రైతులు దోమ మందు పిచికారి చేశారే తప్ప ఎలాంటి చీడపీడల బెడద లేదు. పత్తికి అనుకూలంగా వర్షాలు కురుస్తున్నాయి. రైతులు ఇప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు పత్తి పంటను చూసుకుంటూ దానికి తగ్గట్టుగా సస్యరక్షణ చర్యలు తీసుకుంటే ఆశించిన దిగుబడి వస్తుంది.



హుజూరాబాద్ మండలం కాట్రపల్లిలో ఏపుగా పెరిగిన పత్తి

రేపు పొలాల అమావాస్య

● మంగళవారం నుంచి భాద్రపద మాసం



కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 31: శ్రావణమాసం ఆదివా రంతో ముగుస్తోంది. సోమ వారం పొలాల అమా వాస్య రానుంది. అమావాస్య సెప్టెం బరు 2వ తేదీ సోమ వారం తెల్లవారుజామున ప్రారంభ మవు తుండడంతో సోమవతీ అమావాస్య అని కూడా పిలుస్తారు. అమా వాస్య రోజు, వచ్చే భాద్రపద మాసంలో పలు పుణ్య, ధర్మ, కార్యచర ణాలు నిర్వహించా లని శాస్త్రాలు చెబుతున్నా యి. అనాది నుంచి వస్తున్న ఆచార సాంప్రదాయాల ప్రకారం ఆయా కార్యాలను జనం నిర్వహిస్తారు.

● నెల పాటు ముహూర్తాలు లేవు..

శ్రావణం తర్వాత వచ్చే శూన్యమాసంగా చెప్పుకునే భాద్రపద మాసం మంగళవారం నుంచి ప్రారంభమవుతుంది. శుభ ముహూర్తాలు లేకున్నా కొన్ని పితృ, దేవ పర్వదినాలు ఈ మాసంలోనే వస్తాయి. అక్టోబరు 3 నుంచి మొదలుకొని డిసెంబరు వరకు మూడు నెలల పాటు వివాహాది శుభము హూర్తాలున్నాయి.

ఎల్‌ఎండీ @ 12.92 టీఎంసీలు

తిమ్మాపూర్, ఆగస్టు 31: దిగువ మానేరు జలాశయంలోకి శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ (మిడ్ మానేరు) నుంచి ఇన్‌ఫ్లో శనివారం తగ్గింది. శనివారం ఉదయం 14,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా సాయంత్రానికి మూడు వేలకు తగ్గింది. మిడ్‌మానేరు పూర్తి స్థాయి సామర్థ్యం 27.5 టీఎంసీలకు ప్రస్తుతం 14.92 టీఎంసీల నీరు ఉంది. శ్రీపాద ఎల్లంపల్లి నుంచి 6,300 క్యూసెక్కుల నీరు మిడ్‌మానేరులోకి వస్తుండగా అందులో నుంచి మూడు వేల క్యూసెక్కుల నీటిని ఎల్‌ఎండీకి విడుదల చేస్తున్నారు. ఎల్‌ఎండి పూర్తి స్థాయి సామర్థ్యం 24 టీఎంసీలకు ప్రస్తుతం 12.923 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిడ్‌మానేరు నుంచి మూడు వేల క్యూసెక్కులు, మోయతుమ్మెద వాగు నుంచి 1,100 క్యూసెక్కులు, మొత్తంగా 4,100 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండిలోకి వచ్చి చేరుతున్నాయి. 253 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి జరుపుకోవాలి...

● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 31: రాబోయే వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, నవరాత్రి ఉత్సవాలలో అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, అధికారుల సమన్వయ సమావేశాన్ని పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో శనివారం నిర్వహించారు. సమావేశానికి ముందు పోలీస్ అధికారులు వినాయక చవితి ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ గణేష్ ఉత్సవాల్లో ఇప్పటి వరకు ఎటువంటి ఘటనలూ జరిగిన చరిత్ర లేదని, నిర్వాహకులు ఆ ఆనవాయితీని కొనసాగించాలని కోరారు. నవరాత్రి ఉత్సవాలకు కావలసిన అన్ని రకాల ఏర్పాట్లను ముందే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కరీంనగర్‌లోని గణేష్ మండపాలకు అవసరమైన విద్యుత్తు బిల్లును తాను చెల్లిస్తానని చెప్పారు. 24 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని, మండపాల్లో నిర్వాహకులు తప్పనిసరిగా ఉండాలని కోరారు. నిమజ్జనానికి సంబంధించి నిర్దేశించిన ప్రదేశాల్లో పూర్తిస్థాయి బారికేడ్స్, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీరు, లైటింగ్, మొబైల్ టాయిలెట్ ఏర్పాట్లు చేయాలన్నారు. నిమజ్జనం పాయింట్ల వద్ద క్రేన్‌లను, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని, వారి వివరాలు ముందుగానే జిల్లా యంత్రంగానికి అందించాలని మత్స్య శాఖ అధికారిని కోరారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ మట్టి గణపతులను ప్రతిష్టించేందుకు ప్రాధాన్యం ఇవ్వా లని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు. సీపీ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు ముందుగా పోలీసు అనుమతి తీసుకో వాలన్నారు. రోడ్డుకు అంతరాయం లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేసు కోవాలన్నారు. రాత్రి వేళ మండపాల వద్ద కమిటీ సభ్యులు కాపలాగా ఉండాలన్నారు. నిమజ్జనానికి సంబం ధించిన రూట్ మ్యాప్‌ను ముందే తెలియజేయాలన్నారు. పోలీస్‌శాఖ సూచనలు కచ్చితంగా పాటించా లన్నారు. కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనా రాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, గణేష్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గణేశ్ నవరాత్రోత్సవాల నిర్వహణ ఉత్సవ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

వినాయక విగ్రహాల అమ్మకాలు షురూ..





నగరంలో వినాయక విగ్రహాల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. చవితి పండుగకు వారం రోజుల ముందే కొనుగోలుదారులతో దుకాణాలు సందడిగా మారాయి. వివిధ ఆకృతుల్లో రూపొందిన వినాయకులను మండపాల నిర్వాహకులు కొంటున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కరీంనగర్

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 31: సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సీపీ అభిషేక్ మొహంతి సిబ్బందిని ఆదేశించారు. కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను సీపీ శనివారం తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టిన నూతన చట్టాల అమలు జరిగేలా చూడాలన్నారు. పెండింగ్ వారెంట్ల అమలు చేయాలన్నారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా భూ ఆక్రమణలు జరిగినట్లు ఫిర్యాదులు అందాయని కమీషనర్ తెలిపారు. ఈ ఫిర్యాదులపై స్పందించి, విచారణ జరిపి, నిందితులను గుర్తించి, పలు కేసుల్లో బాధితులకు న్యాయం చేస్తున్న ఎస్‌హెచ్‌వో ప్రదీప్‌కుమార్‌తో పాటు వారి సిబ్బందిని సీపీ అభినందించారు. కార్యక్రమంలో సీఐ ప్రదీప్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులందరికీ హెచ్ఐవీ పరీక్షలు చేయాలి

సుభాష్‌నగర్,ఆగస్టు 31: గర్భిణులందరికీ హెచ్ఐవీ పరీక్షలు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత సూచించారు. శనివారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్)లకు ఓరియెంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పీలు వారి సబ్ సెంటర్ల పరిధిలోని గ్రామాల్లో ఈనెల 1 నుంచి అక్టోబరు 31 వరకు స్క్రీనింగ్ కాంపెయిన్, అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగులకు వారి కేసు హిస్టరీ తెలుసుకొని, 20 శాతం మందికి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించాలన్నారు. కమ్యూనిటీ లెవెల్‌లో పీపీటీసీటీ కౌన్సిలర్లు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, అంగన్‌వాడి టీచర్లు, ఆశ కార్యకర్తలు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం సురేందర్‌రెడ్డి, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సుధ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సనాజువేరియా, జె సరస్వతి, బి కైక, డీపీవో స్వామి పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

- రెండు, మూడు రోజుల పాటు భారీ వర్ష సూచన
- అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశం



కరీంనగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లావ్యాప్తంగా శనివారం వర్షాలు కురుస్తున్నాయి. మరో రెండు, మూడు రోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. అవసరమైతే విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వాలని, అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ముఖ్యకార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. చెరువులు, కుంటలు, వాగుల్లోకి వచ్చి చేరుతున్న వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, చెరువులు, కుంటలకు గండ్లు పడకుండా చూడాలని కలెక్టర్ పమేలాసత్పతి అధికారులను అప్రమత్తం చేశారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి, అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా పనిచేసే స్థానాల్లోనే ఉంటూ పరిస్థితులను నిశితంగా పరిశీలించి ఎప్పటికప్పుడు సమాచారం అందించేలా చూడాలన్నారు. ఇంజనీరింగ్ విభాగాల అధికారుల క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అవాంఛనీయ సంఘటలనకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ఎక్కడైనా వర్షాలతో ఇబ్బందులు ఎదురైతే వెంటనే సమాచారం అందించేలా సిబ్బందిని సమాయత్తం చేయాలని ఆదేశించారు. అన్నిశాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో సమర్థవంతంగా పనిచేయాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస చర్యలు చేపట్టాలని సూచించారు. లో లెవల్ వంతెనలు, కాజ్‌వేల వద్ద బస్సులను జాగ్రత్తగా నడిపేలా ఆర్టీసీ డ్రైవర్లను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. అవసరమైతే వరద ప్రవాహం ఏర్పడే ప్రాంతాల మీదుగా వాహనాల రాకపోకలను నిషేధించాలని లేదా ఇతర ప్రాంతాల మీదుగా వాహనాల రాకపోకలను మళ్ళించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీలు, మ్యాన్‌హోల్స్ కూరుకుపోయి వర్షపునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయే అవకాశాలు ఉందని, ముందస్తుగానే వాటిని శుభ్రం చేయించాలని ఆదేశించారు.

● జిల్లావ్యాప్తంగా వర్షాలు :

జిల్లాలో శనివారం మోస్తరు వర్షం కురిసింది. జమ్మికుంట మండలం కొత్తపల్లి-ధర్మారంలో అత్యధికంగా 41.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జమ్మికుంటలో 34.8, హుజూరాబాద్ మండలం బోర్నపల్లిలో 33.5, కొత్తపల్లి మండలం చింతకుంటలో 20.3, చొప్పదండి మండలం వెదురుగట్టులో 19.8, కరీంనగర్‌లో 18.5, గన్నేరువరం మండలం ఖాసీంపేటలో 17.3, చొప్పదండి మండలం ఆర్నకొండలో 17.3, మానకొండూర్ మండలం పోచంపల్లిలో 15.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఆగస్టులో జిల్లాలో 18 రోజులు వర్షాలు కురిసి 215.5 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇది సాధారణ వర్షపాతానికంటే ఆరు శాతం ఎక్కువ. జూన్, జూలై మాసాల్లోనూ సాధారణ వర్షపాతానికంటే ఎక్కువే నమోదైంది. జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో 92 రోజులకుగాను 50 రోజుల్లో వర్షాలు కురిశాయి. సాధారణ వర్షపాతం 570.5 మిల్లీమీటర్లు కాగా, 751.30 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కూలిన ప్రాచీన పాండురంగ దేవాలయం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 31: నగరంలోని పాతబజార్ 49వ డివిజన్ పరిధిలోని అతి ప్రాచీన శ్రీపాండురంగ దేవాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో కురుస్తున్న వర్షాలతో స్లాబ్ పైకప్పు, గోడలు కూలి పోయాయి. సమాచారం తెలుసుకున్న డిప్యూటీ మేయర్ చల్లస్వరూప రాణి హరిశంకర్ స్థానిక కార్పొరేటర్ కమల్ జిత్‌కౌర్ సోహెన్‌సింగ్‌తో కలిసి శనివారం ఆలయాన్ని పరిశీలించారు. ఆలయంపై కప్పు, గోడలు కూలినందున భక్తులు, ప్రజలు ఎవరు కూడా ఆలయంలోకి వెళ్ళవద్దని సూచించారు. కూలిపోయిన గోడలు, పైకప్పును తొలగించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా వేదపండితులు బ్రహ్మశ్రీ మంగళంపల్లి వేణుగోపాల శర్మతో, భూ యజమానితో మాట్లాడి ఆలయ పునర్నిర్మాణం చేపట్టే విధంగా కార్యాచరణ రూపొందించి నిర్మాణాన్ని ప్రారంభించాలని డిప్యూటీ మేయర్ సూచించారు.

కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి కేంద్ర మంత్రి భూమి పూజ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 31: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి సంజయ్ కుమార్ నగరంలో కమ్యూనిటీ భవనాలకు నిధులు కేటాయించి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. శనివారం 29వ డివిజన్ కాపువాడలో నిర్మించనున్న కాపువాడ కమ్యూనిటీ భవనానికి రూ.15 లక్షలు, 13వ డివిజన్ పెద్దమ్మ కాలనీలో వడ్డెర కమ్యూనిటీ హాల్‌కు ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గుగ్గిళ్ళపు రమేశ్, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీతో కలిసి కమ్యూనిటీ భవనాలకు శంఖుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమాల్లో సంఘాల ప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కాపువాడలో శంకుస్థాపన చేస్తున్న బండి సంజయ్‌కుమార్

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దశల వారీగా ఆందోళనలు

సుభాష్‌నగర్, ఆగస్టు 31: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా సెప్టెంబరు 2 నుంచి దశల వారీగా ఆందోళనలు చేపట్టాలని ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జేఎస్‌రావు, సీనియర్ న్యాయవాది కొరివి వేణుగోపాల్, కరీంనగర్ అధ్యక్షుడు బద్దం డానియల్ పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక కార్ఖానగడ్డలో గల అంబేడ్కర్ మెమోరియల్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సెప్టెంబరు 2న తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన, అనంతరం వినతిపత్రాల అందచేత, 11న ఎమ్మెల్యే, ఎంపీ, చైర్మన్, కేంద్ర, రాష్ట్ర మంత్రులకు వినతి పత్రాలు ఇస్తామన్నారు. 16న కలెక్టరేట్ ఎదుట నిరసనలు, 27న చలో హైదరాబాద్, అసెంబ్లీ ముట్టడి ఉంటుందని తెలిపారు. అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు వర్గీకరణకు, క్రిమిలేయర్‌కు అనుకూలమా, వ్యతిరేకమా స్పష్టం చేయాలన్నారు. సమావేశంలో వంచిత్ బహుజన్ ఆఘాడి పార్టీ రాష్ట్ర కార్యదర్శి తీగల శేఖర్, గంగాధర్, దశరథం, ఎడ్ల రామకిషన్, టి ఓంప్రకాశ్, గంభీరావు పేట అంజయ్య, దొంత రాజేశం, కాంపెల్లి రమణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ


స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 31: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదేశాలతో ఆలయ పీఆర్వో అశోక్, సూపరింటెండెంట్ తిరుపతిరావులు, ఎడ్ల శివసాయిలు ఏర్పాట్లను పరిశీలించారు.

శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు..

శ్రావణ మాసం పురస్కరించుకుని శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు భీమేశ్వర స్వామి వారి ఆలయంలోని శనీశ్వరుడికి భక్తులు నువ్వుల నూనేతో అభిషేకం నిర్వహించి స్వామి వారికి నల్లబట్టను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ముగ్గురు ఉద్యోగుల పదవీ విరమణ..

రాజన్న ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న సూపరింటెండెంట్ అల్లి శంకర్, ముఖ్య అర్చకులు అప్పాల కరుణాకర్, స్కావెంజర్ జాక్పాల్ శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ ఆవరణలో ఓపెన్ స్లాబ్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించగా, ఆలయ ఉద్యోగుల కార్యదర్శి కూరగాయాల శ్రీనివాస్, ఈఈ రాజేష్, ఏఈవోలు జయకుమారి, శ్రీనివాసు పదవీవిరమణ పొందిన వారిని సత్కరించారు. అప్పాల కరుణాకర్ సుధ దంపతులు నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై సన్మానించారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	15,689	4,825	80.5	60.823
ఎల్లంపల్లి	14,302	6,580	20.175	18.063
మిడ్ మానేరు	10,450	19,550	27.54	14.98
ఎల్ఎండీ	4.100	253	24.034	12.923

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● నలుగురికి తీవ్ర గాయాలు



తాడూరి రాజమౌళి(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 31: వివాహానికి వెళ్తూ ఓ వ్యక్తి మృతి చెందగా, నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన తాడూరి రాజమౌళి(60) తన సోదరుడి కుమారుడి వివాహం శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలోని మత్స్యగిరీంద్రస్వామి దేవాలయంలో ఏర్పాటు చేశారు. వివాహానికి హాజరయ్యేందుకు శనివారం తెల్లవారుజామున గ్రామం నుంచి తాడూరి గంగయ్య మరి కొందరితో కలిసి ఆటోలో బయల్దేరి వెళ్లారు. ఆటో సింగాపూర్ శివారులోని వెన్నంపల్లి క్రాస్ వద్దకు చేరుకోగానే ఓ గుర్తు తెలియని వాహనం అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో తాడూరి రాజమౌళి తలకు బలమైన గాయం కాగా, ఆటోలో ప్రయాణిస్తున్న తాడూరి హనుమయ్య, తాడూరి ధర్మయ్య, అక్షయ తిరుపతి, తాడూరి గంగయ్య, పల్లె కొమురయ్య, పల్లె హర్షవర్ధన్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తాడూరి రాజమౌళిని ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ విచారం వ్యక్తం చేశారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

● టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, ఆగస్టు 31: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ అన్నారు. శనివారం కరీంనగర్ సర్కిల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేబుల్, బ్రాడ్ బ్యాండ్ ఆపరేటర్లు కేబుల్‌లను విద్యుత్ స్తంభాలపై క్రమ పద్ధతిలో ఉంచాలన్నారు. బ్రేక్ డౌన్ పునరుద్ధరించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూసుకోవాలన్నారు. కేబుల్ వైర్లు అస్తవ్యస్తంగా ఉండటం వలన వినియోగదారులు విద్యుత్ వైర్లకు, కేబుల్ వైర్లకు తేడా తెలియక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం పోల్ రెంటల్ చార్జీలను వసూలు చేయాలన్నారు. వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన పంపుసెట్లకు విద్యుత్ ఇవ్వడానికి అంచనాలు వర్క్స్ ఆర్డర్లను త్వరగా మంజూరు చేసి 30-40 రోజుల వ్యవధిలో కొత్త వ్యవసాయ కనెక్షన్లను మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం ఈనెల 17నుంచి నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో గృహజ్యోతి లబ్ధి పొందని వినియోగ దారులు దరఖాస్తులను ఇవ్వడానికి అవగాహన కల్పించాలని తెలిపారు.



కరీంనగర్ సర్కిల్ అధికారుల సమావేశంలో ఎస్ఈ

● వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ సూచించారు. తడిసిన కరెంట్ స్తంభాలను ముట్టుకోరాదన్నారు. విద్యుత్ లైన్‌కు చెట్టు కొమ్మలు తగిలితే సంబంధిత అధికారికి తెలియజేయాలని అన్నారు. ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోరాదన్నారు. ఉతికిన బట్టలు ఇనుప తీగలపై ఆరవేయకూడదని సూచించారు.

టేకు చెట్ల నరికివేత



నరికివేసిన టేకు చెట్టు

వీర్నపల్లి: ఆగస్టు 31: మండలంలోని అల్మాస్‌పూర్ అటవీ సెక్షన్ పరిధిలోని కంచర్ల శివారులోని లచ్చక్క గుడ్డంలో ఏపుగా పెరిగిన టేకు చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి అటవీ ప్రాంతంలోనే సైజులుగా మార్చి రహస్యంగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. రైతులు సొంత చేలలో చెట్లు నరికితే కేసులు పెడుతున్న అధికారులు అటవీ సంపదను నాశనం చేస్తున్న పట్టించుకోవడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్ల నరికివేతపై ఎఫ్ఎస్ఓ పద్మలతను వివరణ కోరగా ప్రతిరోజు అటవీ ప్రాంతంలో నిఘా పెడు తున్నామని, చెట్లను నరుకుతున్న వారిని పట్టుకొని కేసులు నమోదు చేస్తామన్నారు.



అటవీప్రాంతంలో నరికివేసిన టేకు చెట్లు

ఇద్దరు డీజే నిర్వాహకులపై కేసు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 31: ఎలాంటి అనుమతులు లేకుండా డీజేలు నడిపిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదుచేసి అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద, వెంకంపేట వద్ద రోడ్లపై డీజేలు పెట్టుకొని ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న డీజే యజమానులైన పి. పవన్‌కుమార్, గోలి రాజేందర్‌పై వేర్వేరుగా కేసు నమోదు చేశామన్నారు. రెండు డీజేలను సీజ్‌చేశామన్నారు. డీజే యజమానులను అరెస్ట్‌చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. జిల్లాలో డీజే యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చామని, అయినప్పటికీ పోలీసుల సూచనలు బేఖాతరు చేయడం వల్ల కఠినచర్యలు తీసుకుంటున్నామన్నారు. గణేశ్ మండపాల వద్ద పోలీసు అధికారుల అనుమతితో చిన్న స్పీకర్లు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి రోజు రాత్రి 10గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. డీజేల వలన చిన్నపిల్లలు, విద్యార్థుల చదువునకు , వృద్ధుల ఆరోగ్యానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని డయల్ 100కు కాల్స్ రావడంతో వెంటనే చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేసినా, యాంప్లిఫైయర్‌తో బాక్స్‌లు ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణేశ్ మండపాల్లో, శోభాయాత్రలోనూ డీజేలు ఏర్పరిచి ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ఎవరైనా డీజేలు ఏర్పాటుచేస్తే యజమానులు, నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

గంభీరావుపేట, ఆగస్టు 31:మండలంలోని నర్మాల మానేరు క్యాంపు మైసమ్మ ఆలయం సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడిన దేవేందర్‌గౌడ్ అనే వ్యక్తి శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం సింగరాయపల్లి గ్రామానికి చెందిన దేవేందర్‌గౌడ్ గంభీరావుపేట మండలం శ్రీగాధలోని తన అత్తగారింటికి వెళ్లే క్రమంలో నర్మాల మానేరు ప్రాజెక్టు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. దీంతో దేవేందర్‌గౌడ్ ముఖం, కాళ్లు చేతులతో పాటు తలకు బలమైన గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ దేవేందర్‌గౌడ్ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, రెండు నెలల పాప ఉన్నారు.

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

మల్యాల, ఆగస్టు 31: దిగువ కొండగట్టులో శనివారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. ఈ మేరకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష ఇతర సిబ్బంది టిఫిన్ సెంటర్లు, హోటళ్లను పరిశీలించారు. కొన్ని హోటళ్లలో కుళ్లిన వస్తువులు, కాలం చెల్లిన తిండి పదార్థాలను గుర్తించి వాటిని పడేశారు. పరిశుభ్రతతో శుచి, శుభ్రతతో నాణ్యత గల వాటినే ప్రజలకు అందించాలని లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో తనిఖీల సమయంలోనూ పాడైన వస్తువులు లభించగా తీరు మారకపోవడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటళ్లకు లైసెన్స్‌లు తీసుకోవాలని, లైసెన్స్‌లు ఉన్న వారు వారం రోజుల్లోగా రెన్యూవల్ చేసుకోవాలని లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జమ్మికుంటలో గంజాయి పట్టివేత

జమ్మికుంట, ఆగస్టు 31: జమ్మికుంట రైల్వేస్టేషన్ నుంచి బల్లార్షకు గంజాయి తరలించేందుకు ప్రయత్నిస్తున్న ఓ మహిళను ఎక్సైజ్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. జమ్మికుంట పట్టణానికి చెందిన యండి శమీమ్ అనే మహిళ బల్లార్షకు గంజాయి తరలించేందుకు రైల్వేస్టేషన్ చేరుకుంది. సమాచారం అందుకున్న అబ్కారీ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి సదరు మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద ఉన్న 490గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, తహశీల్దార్ ఎదుట హాజరు పరిచారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో అబ్కారీ సీఐ మాధవీలత, ఎస్సై సౌమ్య, కానిస్టేబుళ్లు అయిలయ్య, పెద్దన్న, భాస్కర్, మహేష్, పద్మావతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

● రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి ● ఎనుమాముల మార్కెట్‌లో అధికారులతో సమీక్ష

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 31: వ్యవసాయ మార్కెట్లలో రైతులకు మెరుగైన సేవలందించమే తమ ముందున్న లక్ష్యమని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి అన్నారు. శనివారం వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఏనుమాముల, జనగామ, జమ్మికుంట, మహబూబాబాద్, ఖమ్మం మార్కెట్ కమిటీల కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులు ఏనుమాముల మార్కెట్‌లోని పలు సమస్యలను మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. మార్కెటింగ్ శాఖలో ముఖ్యంగా మార్కెట్లలో సిబ్బంది కొరత ఉన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఉన్న అధికారులు, సిబ్బందితో ప్రస్తుతం ఉన్న సాంకేతికతను జోడించి మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఏనుమాముల మార్కెట్‌లో ఉన్న వేబ్రిడ్జిలను మరమ్మతు చేయించి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. లక్ష్మీపురం, మార్కెట్‌తో పాటు ఏనుమాముల మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. మార్కెట్‌లో దడువాయిలు వాడే పీవోఎస్ మిషన్లు కొత్తవి కొనుగోలు చేస్తున్నామని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. మార్కెట్‌లో ఎలాంటి సమస్యలున్నా వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఒక్కో మార్కెట్ స్థితిగతులు, అక్కడి సమస్యలు, మార్కెట్ ఫీజువసూళ్లు, అలాగే అభివృద్ధి పనులపై సంబంధిత కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. సీజన్ ప్రారంభం కాకముందే అభివృద్ధి పనులను పూర్తి చేయించాలని సూచించారు. మార్కెట్ ఫీజు పెండింగ్ లేకుండా వసూలు చేయాలని, ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో కె.సురేఖ, ఏనుమాముల మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, గ్రేడ్- 2 కార్యదర్శులు అజిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

మార్కెట్ కమిటీ ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వహించవద్దని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి మార్కెట్ కమిటీ కార్యదర్శులకు సూచించారు. శనివారం ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో వరంగల్, జనగామ, జమ్మికుంట, ఖమ్మం, మహబూబాబాద్ మార్కెట్ కమిటీల కార్యదర్శులతో మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్‌లతో కలిసి లక్ష్మీబాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కో మార్కెట్ కమిటీ స్థితిగతులు, అక్కడి సమస్యలు, మార్కెట్ ఫీజు వసూళ్లు, అలాగే అభివృద్ధి పనులపై సంబంధిత కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. సీజన్ ప్రారంభం కాకముందే అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు. మార్కెట్ ఫీజు పెండింగ్ లేకుండా వసూలు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో కె.సురేఖ, ఎనుమాముల మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, జన్ను భాస్కర్, లాషరీప్, పి.అశోక్, జీవన్ పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

గణేశ్‌నగర్, ఆగస్టు 31: స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గీతాభవన్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. బీసీ సమగ్ర కులగణన చేపట్టి రాజ్యాధికారంలో బీసీల వాటా తేల్చాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీల కులగణన కోసం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడానికి స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కుల గణన ప్రారంభించే వరకు ప్రభుత్వంపై తమ పోరాటం ఆగదన్నారు. బీసీలకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వాలను ప్రశ్నిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నారాజు రాకేష్‌చారి, బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాస సంజీవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రంగు సంపత్ గౌడ్, ఎడ్ల సురేందర్, బ్రహ్మచారి, నలవెలి రవి, బండారి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● బంగారు ఆభరణాల అపహరణ

శంకరపట్నం, ఆగస్టు 31: శంకర పట్నం మండలం మొలంగూర్ పరిధిలోని గుడాటిపల్లి గ్రామంలో ఇంటి తాళం పగల గొట్టి చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రం సంజీవరెడ్డి భార్యతో కలిసి ఈ నెల 30న సాయంత్రం తన కుమారుడి కొడుకు పుట్టిన రోజు ఫంక్షన్‌కు కరీంనగర్‌కు వెళ్లాడు. తిరిగి శనివారం ఇంటికి వచ్చి చూసే సరికి బీరువా తాళం పగలగొట్టి వస్తువులు చిందర వందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు క్లూస్ టీమ్‌తో అక్కడికి చేరుకొని వివరాలను నమోదు చేసుకొని వేలిముద్రలు సేకరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

భార్య చికెన్ వండలేదని ఆత్మహత్య



కిశోర్(ఫైల్)

సుల్తానాబాద్, ఆగస్టు 31: చికెన్ తీసుకుని ఇంటికి వచ్చిన భర్త వండమని భార్యకు చెప్పాడు. ఇంటి పనిలో బిజీగా ఉన్న భార్య కాసేపు ఆగిన తర్వాత వండుతానని చెప్పింది. దీంతో మనస్తాపం చెందిన భర్త ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... సుల్తానాబాద్ మున్సిపల్ విలీన గ్రామమైన పూసాల గ్రామానికి చెందిన పూసాల కిశోర్(33) కార్పెంటర్. తాగుడుకు బానిసై పనిలేకుండా తిరుగుతూ అప్పుడప్పుడు కూలీ పనికి వెళ్లి వచ్చిన డబ్బును తాగుడుకే ఖర్చు చేస్తున్నాడు. దాంతో ఇంట్లో పూట గడవక భార్య సుల్తానాబాద్ పట్టణంలోని ఓ కిరాణా షాపులో పనిచేస్తోంది. ఆ వచ్చే డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తోంది. శనివారం రాత్రి ఇంటికి చికెన్‌తో వచ్చిన కిశోర్ తన భార్యను కూర వండమని చెప్పాడు. కొంత సేపాగి వండుతానని భార్య చెప్పడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 31: తనకు రావాల్సిన వాటా భూమి విషయంలో సోదరుడితో వివాదం విషయంలో మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన కొప్పుల చంద్రకాంద్(45) చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడని కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. వల్లంపహాడ్‌కు చెందిన కొప్పుల చంద్రకాంత్ భూమి విషయంలో సోదరుడితో గొడవపడి ఈ నెల 24న వెంకటేశ్వర ఆలయం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అధిక వడ్డీ వసూలు చేస్తున్న వ్యక్తికి జరిమానా

ఇల్లంతకుంట, ఆగస్టు 31: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన మొల్లంకుల బాలయ్య ఇతరులకు అప్పులు ఇచ్చి అధిక వడ్డీ వసూలు చేస్తున్నాడని శనివారం కలెక్టర్ రెండు లక్షల రూపాయల జరిమానా విధించినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకున్న బాలయ్య అధికంగా వడ్డీ వసూలు చేస్తున్నాడనే ఫిర్యాదు మేరకు ఏప్రిల్ నెలలో దాడి చేశామని తెలిపారు. బాలయ్య వద్ద ప్రామిసరీ నోట్స్, చెక్కులు, డాక్యుమెంట్లు లభించగా కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఎదుట హాజరుపర్చగా రెండు లక్షల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగ పట్టివేత

కరీంనగర్ క్రైం/భగత్‌నగర్, ఆగస్టు 31: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక ప్రయాణికుడి సెల్‌ఫోన్‌ను దొంగలిస్తుండగా సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది రెడ్‌హ్యాండ్ డెడ్‌గా పట్టుకున్నారు. బస్టాండ్‌లోని 14వ ప్లాట్‌ఫాం వద్ద జి.శ్రీనివాస్ అనే ప్రయాణికుడు బస్‌లోకి ఎక్కుతుండగా శనివారం చెన్నూర్‌కు చెందిన ఎం.సతీష్ అనే వ్యక్తి సెల్‌ఫోన్ చోరీకి యత్నించాడు. విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ ఎం.లక్‌పతి, కానిస్టేబుల్ రమణ, కొమురయ్య, కవితలు పట్టుకున్నారు. అనంతరం సతీష్‌ను, సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ● మిడ్ మానేరు నిర్వాసితులతో సమావేశం

వేములవాడ టౌన్, ఆగస్టు 31: మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితల సమస్యల పరిష్కారా నికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. వేములవాడ మండలం చీర్లవంచ గ్రామంలో ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, కొడుముంజ, అనుపురం, శభాష్‌పల్లి, చింతలఠాణ, గుర్రంవానిపల్లి గ్రామాలకు చెందిన నిర్వాసితులతో శనివారం సహావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమా నికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల వారీగా సమస్యల ను అడిగి తెలుసుకున్నారు. తమ ఇళ్లకు పరిహారం, పట్టాలు, 18 ఏళ్ల నిండిన వారికి పరిహా రం, ఆల యాలకు పరిహారం రాలేదని ఇతర సమస్యలను ప్రభుత్వ విప్, కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తమ గ్రామాలకు సరిహద్దులు చూపాలని, ఆక్రమణలు నిరోధించాలని, శ్మశాన వాటికల వద్ద సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముంపు గ్రామాల పరిధి లో వెలిసిన రియల్ ఎస్టేట్ వెంచర్లకు అనుమతులు ఉన్నాయా? డీటీసీపీ అనుమతి ఉందా లేదా తెలుసుకోవాలని, ప్రభుత్వ భూము లపై సర్వే చేసి నివేధిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశిం చా రు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మానవతా దృక్ప థంతో అందరి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి పరిహారం వచ్చేలా కృషి చేస్తాన ని స్పష్టం చేశారు. నోటిఫైడ్ కానీ వారి దరఖాస్తులపై మరోసారి అధికారులతో సర్వే చేయి స్తామని, అర్హులైన ప్రతీఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఆర్డీవో రాజేశ్వర్, ఎస్డీసీ రాధాబాయ్, డీఆర్డీవో శేషాద్రి, తహసీల్దార్ మహేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఎరువుల అమ్మకాల్లో నిధుల దుర్వినియోగం

● ముగ్గురు అధికారుల అరెస్టు

వేములవాడ రూరల్, ఆగస్టు 31: మార్క్‌ఫెడ్‌లో ఎరువుల అమ్మకాల్లో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ముగ్గురు నిందుతులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం సీఐ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మార్క్‌ఫెడ్‌లో ఎరువుల అమ్మకాలకు సంబంధించి బకాయిల అవకతవకలున్నట్లు గమనించిన యాజమాన్యం చీఫ్ అకౌంట్స్ అధికారికి విచారణ చేయమని జూలై నెలలో ఆదేశాలిచ్చింది. విచారణ చేపట్టిన అధికారి సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. వేములవాడ డీసీఎంఎస్‌కు సంబంధించి 2022 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 76,77,325 రూపాయల అవకతకవకలు జరిగినట్లు గుర్తించారు. జిల్లా మార్క్‌ఫెడ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పి రమేష్ తన భార్య పేరుతో ఎరువుల షాప్ కోసం లైసెన్స్ తీసుకున్నాడు. మార్క్‌ఫెడ్‌కు అడ్వాన్స్ చెల్లించి ఎరువులను తీసుకోవాల్సి ఉండగా అకౌంటెంట్ భాస్కర్ సాయంతో నగదు చెల్లించినట్లు నకిలీ పత్రాలు సృష్టించారు. నకిలీ పత్రాలతో జిల్లా మేనేజర్ దివ్యభారతికి బకాయిలు లేనట్లుగా చూపించి ఎరువులను పొంది బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుని 76,77,325 రూపాయలు సొంతానికి వాడుకున్నారు. విచారణ అనంతరం మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు జిల్లా మార్క్‌ఫెడ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పి రమేష్‌ను,అకౌంటెంట్ భాస్కర్‌ను విధుల నుంచి తొలగించారు. అనంతరం రమేష్, భాస్కర్‌తో పాటు విధుల్లో బాధ్యతారహితంగా వ్యవహరించిన జిల్లా మేనేజర్ దివ్యభారతిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మార్క్‌ఫెడ్ యాజమాన్యం ఫిర్యాదు చేసింది. దీంతో శనివారం జిల్లా మార్క్‌ఫెడ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రమేష్, అకౌంటెంట్ భాస్కర్, జిల్లా మేనేజర్ దివ్యభారతిలను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

6న ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 31: ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 6న ఉమ్మడి జిల్లా బాలుర సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలను నిర్వహించనున్నారు. రామడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉదయం 9గంటల నుంచి హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను వరంగల్ జిల్లా హన్మకొండలో 14, 15 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక చేయనున్నామని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వం, క్రమశిక్షణ అలవడుతాయన్నారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. అసోసియేషన్ ద్వారా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహిక క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, పుట్టినతేదీ సర్టిఫికె ట్‌ను వెంట తీసుకొని సంఘ సంయుక్త కార్యదర్శి ఎన్. ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్‌లకు రిపోర్టు చేయాలని తెలిపారు. వివరాలకు ఫోన్. 9441925807 నంబర్‌లో సంప్రదించాలని వారు సూచించారు.

దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉంది

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 31: భారత దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు అప్పన్నగారి వెంకట్రావ్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో సెప్టెంబరు 3, 4 తేదీల్లో జరిగే మెగా ఇంపాక్ట్ ప్రోగ్రాం వాల్‌పోస్టర్‌ను ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రావ్ మాట్లాడుతూ ప్రస్తుతం యువతకు జీవితం, సమాజంపై అవగాహన లేకపోవడంతోనే దారుణాలు జరుగుతున్నాయని అన్నారు. వీటిపై అవగాహణ కల్పించడానికి కరీంనగర్‌లో ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మెగా ఇంపాక్ట్ ప్రోగ్రాంను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రోగ్రాంపై ఎలాంటి సందేహాలు ఉన్నా సెల్ : 9676004408 నెంబర్‌కు ఫోన్ చేసి తీర్చుకోవచ్చనని అన్నారు. సమావేశంలో ఉత్తర తెలంగాణ రీజినల్ డైరెక్టర్ కుతాడి తిరుపతి, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి సిరిసిల్ల బాలకృష్ణ, అధ్యక్షుడు కోడం బాలకిషన్ ఉన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు

పోలీసుల అదుపులో బెదిరింపులకు పాల్పడ్డ వ్యక్తి

కోరుట్ల, ఆగస్టు 31: పట్టణానికి చెందిన ఓ రియల్టర్‌ను ఫోన్‌లో డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిని కోరుట్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారం రోజుల నుంచి పట్టణంలో ప్రకాశం రోడ్డుకు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారికి డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాలుపడుతున్న విషయంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి పథకం ప్రకారం పట్టుకున్నారు. మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి పట్టణంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారికి వారం రోజుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తూ ఓ వ్యక్తి ఫోన్ చేస్తూ బెదిరిస్తున్నాడు. మొదట రూ. 50లక్షలు కావాలని ఫోన్ చేసి బెదిరించాడు. దీంతో సదరు వ్యాపారి తనవద్ద అంత డబ్బులేదని ఫోన్ పెట్టేసాడు. మళ్లీ కొత్త నంబర్లతో ఫోన్ చేసి రూ. 5లక్షలైనా ఇవ్వాలని ఒత్తిడి చేశారు. దీంతో గంట తరువాత ఫోన్ చేయండి అని చెప్పి వ్యాపారి విషయాన్ని పోలీసులకు తెలిపాడు. రియల్టర్‌కు గంట తరువాత మళ్లీ ఫోన్ రావడంతో పోలీసుల సూచన మేరకు సదరు వ్యక్తిని రైల్వేస్టేషన్ వద్దకు రావాలని సూచించాడు. బెదిరింపులకు పాలుపడిన వ్యక్తి మరో వ్యక్తితో కలిసి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అప్పటికే అక్కడ మాటువేసిన పోలీసులు పథకం ప్రకారం ఆ వ్యక్తులను అదుపులోకి తీసుకోని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. సదరు వ్యక్తి 6 నెలల క్రితం పోలీసుల వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా తన వాహనంలో పిస్తోల్‌తో దొరికాడు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కొన్ని రోజుల క్రితం జైల్ నుంచి వచ్చిన సదరు వ్యక్తి మరో కేసులో ఇరుక్కుని పోలీసులకు చిక్కడంతో చర్చనీయాశంగా మారింది.

పాపన్న గుట్టలను పరిశీలించిన అధికారులు



సర్వాయి పాపన్న గుట్టల వద్ద అధికారులు

సైదాపూర్, ఆగస్టు 31: సైదాపూర్ మండలంలోని సర్వాయిపేట శివారులో ఉన్న సర్వాయి పాపన్న గుట్టలు, ఆ ప్రాంతాన్ని టూరిస్టు స్పాట్‌గా ఏర్పాటు చేయుటకు టూరిజం అధికారులు డీఈ విద్యాసాగర్, జేఈ జీవన్‌రెడ్డి హుజూరాబాద్ డీఐ పాయబ్ అలీ, సైదాపూర్ తహసీల్దార్ దూలం మంజులలు పర్యటించి పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల సర్వాయి పాపన్న గుట్టలను పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దేందుకు నిధులు విడుదల చేయడంతో ముందుగా ఆ నిధులతో ఏఏ పనులు చేపట్టాలో పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ శరత్, సర్వాయర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఏటీఎం చోరీకి యత్నం

కొడిమ్యాల, ఆగస్టు 31 : కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారికి సమీపంలో మండలంలోని పూడూర్‌లో ఎస్‌బీఐ ఏటీఎం వద్ద గుర్తు తెలియని వ్యక్తి శనివారం తెల్లవారుజామున సుమారు రెండున్నర గంటల ప్రాంతంలో ఏటీఎంను పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నం చేసినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. సంఘటన స్థలాన్ని మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్ పరిశీలించారు. పోలీసులు క్లూస్ టీంతో తనిఖీలు చేశారు.

లారీ కింద పడి యువకుడి మృతి

చొప్పదండి, ఆగస్టు 31: మండలంలోని చాకుంట గ్రామానికి చెందిన దాసరి సంజీవ్ (28) లారి కింద పడి మృతి చెందాడు. ఎస్ఐ అనూష కథనం మేరకు సంజీవ్ తన బైక్‌పై వెళ్తుండగా బైక్ పాడైపోవడంతో చొప్పదండి శివారులోని పెట్రోల్ పంపు దగ్గర ఆగాడు. వర్షం పడుతుండడంతో అక్కడ ఆగి ఉన్న లారీ వెనుకాల కూర్చున్నాడు. లారీని డ్రైవర్ స్టార్ట్ చేయగా సంజీవ్ కాలుపై నుంచి టైరువెళ్లడంతో కుడికాలు విరిగిపోయింది. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సంజీవ్ మృతి చెందాడు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అల్ఫోర్స్ కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి, అతిథులు

భగత్‌నగర్, ఆగస్టు 31: విద్యార్థులు అకాడమిక్ నైపుణ్యాలతో పాటు, ప్రజా నిర్వహణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఐసిఎఫ్ఎఐబి స్కూల్ డిప్యూటీ చీఫ్ మేనేజర్ సురేష్ టకసీ అన్నారు. శనివారం నగరంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో లుమినస్ ఫీస్టా2024 మేనేజ్‌మెంట్ మీట్ వేడుకలను కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డితో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఐఐఎం లాంటి జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక యూనివర్సిటీలలో ప్రవేశా లను పొందడానికి క్యాట్, మ్యాట్ లాంటి పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగా లన్నారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ క్లబ్ నిర్వహణ విద్యార్థినులు నిర్వహించిన వివిధ రకాల ప్రతిభా పాటవ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

వెలిచాల కేశవరావు మెమోరియల్ ట్రస్టు చేయూత


విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తున్న ట్రస్టు ఫౌండర్ ప్రేమ్‌చందర్‌రావు

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 31: కరీంనగర్‌లోని పద్మనాయక వెలమ సంఘం బాలికల వసతిగృహంలో ఉంటూ చదువుకునే ఇద్దరు పేద విద్యార్థినులకు శనివారం కేశవరావు మెమోరియల్ ట్రస్టు ఫౌండర్ వెలిచాల ప్రేమ్‌చందర్‌రావు ఆర్థిక సహాయం అందించారు. ఇద్దరు విద్యార్థినిలకు 25 వేల వంతున చెక్‌లను వెలిచాల రాధమ్మ పేరున స్కాలర్‌షిప్ రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మనాయక వెలమసంఘము అధ్యక్షులు జువ్వాడి వేణుగోపాల్‌రావు, చీటి ప్రకాశ్‌రావు, ఇతర పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

-రూరల్ ఏసీపీ వెంకటరమణ


నృత్యాలు చేస్తున్న ఎస్‌వీజేసీ కళాశాల విద్యార్థులు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 31: విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని రూరల్ ఏసీపీ వెంకటరమణ అన్నారు. శనివారం తీగలగుట్టపల్లి ఎస్‌వీజేసీ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేసి ఉన్నత శిఖరాలకు ఎదగా లన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్‌వీజేసీ విద్యా సంస్థల సెక్రెటరీ ఊట్కూరి మహిపాల్‌రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్ మేడం వెంకట వరప్రసాద్, కాంతాల రామ్‌రెడ్డి, జాన్సన్ గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ సింహాచలం హరికృష్ణ, కోరాస్కూల్ డైరెక్టర్ వంగల సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు స్వాగతం పలికిన కవ్వంపల్లి


మంత్రులకు స్వాగతం పలుకుతున్న కవ్వంపల్లి

తిమ్మాపూర్, ఆగస్టు31: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిల్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఘన స్వాగతం పలికారు. శనివారం రామగుండం నియోజకవర్గంలో పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి హైదారాబాద్‌కు వెళుతుండగా ఎల్ఎండీ కాలనీలో గల మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలోకి ఆహ్వానించారు. వారికి శాలువాలు కప్పి, పూల మొక్కలు అందించి ఘనంగా స్వాగతం పలికారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపించాలి

హుజూరాబాద్, ఆగస్టు 31: రాష్ట్రంలో ప్రైవేట్ విద్యా సంస్థలలో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై సీబీ సీఐడీ అధికారులతో విచారణ జరిపించాలని తెలంగాణ విద్యార్థి యువజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కర్ర శ్రీధర్‌రెడ్డి శనివారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను అధిక ఫీజుల కోసం వేధించడం వల్ల పలు ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులు మానసిక వేదనకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఉన్నత విద్యాశాఖ అధికారులచే పూర్తిస్థాయిలో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి మున్సిపల్ సాధారణ సమావేశం

చొప్పదండి, ఆగస్టు31: చొప్పదండి మున్సిపల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు చేయించాలని, వార్డులలో పారిశుధ్య పనులు చేపట్టాలని, గణేశ్ నిమజ్జనం ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ నాగరాజు. కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

జ్యోతిష్మతిలో ఐబీఎం ఐటీ నైపుణ్యాలపై శిక్షణ

తిమ్మాపూర్, ఆగస్టు31: స్థానిక జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఐబీఎం స్టూడెంట్ డెవలపర్ ప్రోగ్రామ్‌పై ఒక్క రోజు కార్యశాల నిర్వహించినట్లు జ్యోతిష్మతి విద్యా సంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. ఈ కార్యశాల ఎడ్యునెట్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్లౌడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, ప్రిడిక్టివ్ అనలిటిక్స్‌తో సహా అనేక రంగాల్లో అత్యంత డిమాండ్ ఉన్న ఐటీ నైపుణ్యాలను నేర్చుకోవడానికి, జాబ్ మార్కెట్‌లో పోటీ తత్వాన్ని తట్టుకునేందుకు ఐబీఎం సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించడం ద్వారా విద్యార్థులకు ప్రయోగాత్మకంగా నేర్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఐబీఎం 2026 నాటికి ఏఐలో రెండు మిలియన్ల అభ్యాసకులకు శిక్షణ ఇవ్వడానికి కట్టుబడి ఉందని ఎడ్యునెట్ ఫౌండేషన్ మాస్టర్ ట్రైనర్ లక్ష్మణరావు తెలిపారు. ఈ ప్లాట్ ఫారమ్ ద్వారా తమ విద్యార్థులు 20 భాషలలో 200 ఉచిత కోర్సులపై పట్టు సాధించాలని, భవిష్యత్ కోసం కీలకమైన నైపుణ్యాలపై దృష్టి సారించాలని విద్యా సంస్థల కరస్పాండెంట్, సెక్రటరీ జువ్వాడి సుమీత్ సాయి తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఆగస్టు 31: కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలో బీజేపీ సభ్యత్వాన్ని అత్యధికంగా చేయించి విజయవంతం చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. శనివారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నాబూత్ నా కార్యశాల సభ్యత్వ నమోదు (174వ పోలింగ్ బూత్) కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ పోలింగ్ బూత్‌ల పరిధిలో అత్యధికంగా పార్టీ సభ్యత్వం నమోదు చేయించేలా కృషి చేయాలన్నారు. బీజేపీ సభ్యత్వం కావాలనుకునే వారు 8800002024 నంబర్‌కు మిస్ కాల్ ఇవ్వాలన్నారు. కరీంనగర్ జిల్లాలోని కార్మిక సంఘాలు, కుల సంఘాలు, వ్యాపార, ప్రతి సంఘాలతో పాటు వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ప్రతి ఒక్కరిని కలిసి బీజేపీ సభ్యత్వం తీసుకునేలా కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, కొలగాని శ్రీనివాస్, ఎర్రం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి బ్రిడ్జిని ప్రారంభించిన కేంద్ర మంత్రి

కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని కొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన బ్రిడ్జిని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2.65 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ బ్రిడ్జితో కొత్తపల్లి, మల్కాపూర్, లక్ష్మీపూర్, చింతకుంటతో పాటు కరీంనగర్ నగర వాసులకు ప్రయోజనం చేకూరనుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదతరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 31: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ మంత్రి బట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబులకు శనివారం కరీంనగర్‌లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. బట్టి విక్రమార్క, శ్రీధర్ బాబులు పలు అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం కరీంనగర్ మీదుగా రామగుండం వెళ్తున్న క్రమంలో ఉదయం కరీంనగర్‌లోని ఎన్టీఆర్ బైపాస్ వద్ద వారికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందించిన కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆయనను శాలువాతో సన్మానించారు.

బ్రాహ్మణ సేవాసమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయకుమార్

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 31: తెలంగాణ బ్రాహ్మణ సేవాసమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భూపాల్‌పల్లి జిల్లాకు చెందిన పామరాజు విజయకుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లో నియామక పత్రం అందజేశారు. అనంతరం రాష్ట్ర కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాసు గోపాలరావు పాల్గొన్నారు.

నేడు విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ ప్రారంభం

కరీంనగర్ రూరల్, ఆగష్టు 31: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ గ్రామంలో జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రజతోత్సవ ప్రారంభం, కమ్యూనిటీ హాల్ ప్రారంభ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు వోపా జిల్లా అధ్యక్షుడు కట్ట విష్ణు వర్ధన్ శనివారం ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశాన్ని వోపా ప్రొఫెసర్ జయశంకర్ కమ్యూనిటి హాల్‌లో జరుగుతుందని తెలిపారు.

మాదక ద్రవ్యాల నివారణపై సదస్సు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 31: నగరంలోని కిమ్స్ డిగ్రీ, పీజీ, హోటల్ మేనేజిమెంట్ కళాశాలలో శనివారం మాదక ద్రవ్యాలుతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు.

బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి ఎం.సరస్వతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మాదక ద్రవ్యాల విని యోగంతో అనర్థాలు కలుగుతాయన్నారు. ఈకార్యక్రమంలో కిమ్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ సాకేత్‌రామారావు, రిటైర్డు తహసీల్దార్ కేశవరెడ్డి, ఎన్.కల్పన, పి.శాంత పాల్గొన్నారు. గణేశ్‌నగర్,ఆగస్టు 31: నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నివారణపై సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ విజయమణి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంద గణేష్, పీటీం సభ్యులు స్వప్న, పుష్ప, పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించలేదని బీజేపీ, కాంగ్రెస్ నేతల వాగ్వాదం

దుర్శేడ్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ప్రారంభం


దుర్శేడ్‌లో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం

కరీంనగర్ రూరల్, ఆగష్టు 31: కరీంనగర్ మండలం దుర్శేడ్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకు ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ పాటించలేదని శనివారం బీజేపీ, కాంగ్రెస్‌పార్టీ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. సంఘం అధ్యక్షుడు తోట తిరుపతి శనివారం పెట్రోల్‌బంకును ప్రారంభించారు. రెండేళ్ళ క్రితం వినియోగదారుల పెట్రోల్ బంక్‌గా ఉన్న సమయంలో నష్టాలు రావడంతో బంకును మూసి వేశారు. మళ్లీ కమర్షియల్ బంక్‌లుగా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం అనుమతులు రావడంతో తిరిగి పెట్రోల్ బంకును ఆధునీకరించి ప్రారంభోత్సవ చేశారు. శిలాఫలకం ఆవిష్క రించేందుకు అధ్యక్షుడు ప్రయత్నించగా ప్రొటోకాల్ పాటించలేదంటూ, కాంగ్రెస్, బీజేపి నాయకులు బాసవేణి మల్లేశం యాదవ్, మూల వెంకటేశం గౌడ్, ఊరడి శివారెడ్డి, దాది సుధాకర్ తదితరులు అడ్డుకున్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా పెట్రోల్ బంకును ఎలా ప్రారంభిస్తారంటూ వాగ్వాదానికి దిగారు. శిలా ఫలకంలో సంఘం పాలక వర్గ సభ్యుల పేర్లు మాత్రమే ఉన్నాయన్నారు. పాత పెట్రోల్ బంక్‌ను ఆధునీకరించి పునః ప్రారంభించామని, దీనికి ప్రొటోకాల్ అవసరం లేదంటూ సంఘం అధ్యక్షుడు తిరపతి వారికి సర్దిచెప్పారు. అనంతరం డైరెక్టర్‌లతో కలిసి తిరుపతి పెట్రోల్ బంకును ప్రారంభించి వాహనాల్లో పెట్రోల్, డీజిల్ పోశారు. అనంతరం డైరెక్టర్‌లతో జరిగిన సమావేశంలో అధ్యక్షుడు తిరుపతి ఇష్టరాజ్యంగా వ్యవహరి స్తున్నాడని ఇరుకుల్ల డైరెక్టర్ అంజలి భర్త శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించడంతో ఇరువురి నడుమ వివాద మేర్పడింది. మిగతా డైరెక్టర్లు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. కార్యక్రమంలో కరీంనగర్ సొసైటీ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, సంఘం ఉపాధ్యక్షుడు నర్సయ్య, మాజీ అధ్యక్షుడు వేణుమాదవరావు, మంద రాజమల్లు, మాజీ ప్రజా ప్రతినిధులు సుంకిశాల సంపత్ రావు, ఆరె శ్రీకాంత్, కూకట్ల తిరుపతి, సీఈఓ వేణుమాదవ్ పాల్గొన్నారు.

నిత్యావసర ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

భగత్‌నగర్, ఆగస్టు 31: నిత్యావసర ధరలు నియంత్రించడంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. శనివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కేంద్రంలో నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించంలో నరేంద్ర మోడీ పూర్తిగా విఫలమయ్యారన్నారు. ధరలనియంత్రణచేయాలని కోరుతూ సీపీఐ జాతీయ సమితి పిలుపుమేరకు సెప్టెంబర్ 2న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించ తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. 2014 సంవత్సరంలో పెట్రోల్ డీజిల్ ధరలు అదుపులో ఉండేవన్నారు. నేడు డీజిల్, పెట్రోల్ ధరలు వందకు పైగా చేరుకున్నాయన్నారు. రేషన్ కార్డుల ఈకేవైసీ సెప్టెంబర్ 30 వరకు ఉండ డాన్ని ఉపసంహ రించుకోవాలన్నారు. హైడ్రా నిర్వహిస్తున్న దాడులు, రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని స్వాగతి స్తున్నామ న్నారు. కరీంనగర్ జిల్లాలో కుంటలు, చెరువులు, ఎస్సారెస్పీ భూములు అన్యాక్రాంతం అయ్యాయని అన్నారు. అన్యాక్రాం తమైన భూములపై సీపీఐ పక్షాన కమిటీ వేస్తున్నామని 15 రోజుల్లో రిపోర్టు తయారు చేస్తామన్నారు. కరీంనగర్‌లో కూడా హైడ్రా లాంటి సంస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడసృజన్‌కుమార్, బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, నలువాల సదానందం, న్యాలపట్ల రాజు, సాయవేని రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేపట్టాలి : ఆర్డీవో


బీఎల్‌వోలకు సూచనలు ఇస్తున్న ఆర్డీవో రమేష్‌బాబు

వీణవంక, ఆగస్టు 31: ఎన్నికల కమిషన్ అదేశాల మేరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలని హుజూరాబాద్ ఆర్డీవో రమేష్‌బాబు అన్నారు. శనివారం వీణవంక తహశీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాలో తప్పులు, సవరణలు మృతి చెందిన వారి వివరాలు పూర్తి స్థాయిలో సమాచారం సేకరించాలన్నారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సచించారు.ఎలాంటి తప్పులు లేకుండా బీఎల్‌వోలు సర్వే చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమములో తహశీల్దార్ లక్ష్మణ్, నాయబ్ తహసీల్దార్ నిజామోద్దీన్ ఉన్నారు.

మిడ్‌మానేరుకు రెండు పంపుల ద్వారా నీటి విడుదల

రామడుగు, ఆగస్టు 31: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రీ పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతోంది. శనివారం రెండు పంపుల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎస్ఆర్ఆర్ డ్యామ్‌కు తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరా జేశ్వర జలాశయానికి 24.4 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు.

సైదాపూర్ వాసికి నీట్ పీజీ ఎంట్రెన్స్‌లో ర్యాంక్


ధరణి ప్రియ

సైదాపూర్, ఆగస్టు 31: సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన అనగోని సదానందం కూతురు అనగోని ధరణి ప్రియ ఇటీవల ప్రకటించిన నీట్ పీజీ ఫలితాలలో 5,965వ ర్యాంకుతో పీజీ సీటు సాధించింది. డాక్టర్ ధరణి ప్రియ ఎంబీబీఎస్ పూర్తి చేసి యూపీఎస్సీ ద్వారా నియామకం అయి డిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో మెడికల్ అఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పీజీ సీటు సాధించిన డాక్టర్ ధరణి ప్రియను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, గౌడసంఘ అధ్యక్షుడు శ్రీకాంత్, మార్క అనిల్ పలువురు మండల గౌడ సంఘం నాయకులు అభినందించారు.

ఆత్మీయ సమ్మేళనానికి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి ఆహ్వానం

జమ్మికుంట, ఆగస్టు 31: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని శ్రీదుబ్బ మల్లిఖార్జున స్వామి దేవస్థానం ఆవరణలో 1వ తేదీన ఆదివారం మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనం, వనభోజన కార్యక్రమం నిర్వహించనున్నారు. శనివారం కేంద్ర హోం సహాయక శాఖ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను మున్నూరుకాపు సంఘం నాయకులు కలిసి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్, కౌన్సిలర్ పొనగంటి రాము, నాయకులు ఆకుల రాజేందర్, పుప్పాల రఘు, పొనగంటి రవికుమార్, ఉడుగుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పీడీ దూస వీరేశంకు ఘనంగా వీడ్కోలు


దూస వీరేశం దంపతులను ఘనంగా సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

తిమ్మాపూర్, ఆగస్టు31: కరీంనగర్ పరిధిలోని అలుగునూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కేంద్రం సీఓఈలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన దూస వీరేశం శనివారం పదవీ విరమణ సందర్భంగా పాఠశాలలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గురుకులల జోనల్ ఆఫీసర్ ప్రత్యూష ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దూస వీరేశం 34 ఏళ్లుగా విధులు నిర్వర్తించి ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు క్రీడల్లో నైపుణ్యాలు నేర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కాటమయ్య రక్షణ కవచంపై శిక్షణ


గీతకార్మికులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

హుజూరాబాద్, ఆగస్టు 31: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఇప్పల్ నర్సింగాపూర్ గ్రామంలో కాటమయ్య రక్షణ కవచంపై శనివారం గీతకార్మికులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎక్సైజ్ సీఐ తాళ్లపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కాటమయ్య రక్షణ కవచం గీతకార్మికులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచం సబ్సిడీపై అందజేస్తుందన్నారు. హుజూరాబాద్, శంకరపట్నం, సైదాపూర్, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాల్లోని గ్రామాలకు చెందిన 80మంది గీత కార్మికులకు శిక్షణ ఇచ్చామన్నారు. గీత కార్మికులు చెట్లు ఎక్కి ప్రమాదాలు బారిన పడకుండా ఉండేందుకే కాటమయ్య రక్షణ కవచం పనిచేస్తుందన్నారు.

రేపు బోవేరా జయంతి

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 31: డాక్టర్ బోయినపల్లి వేంకటరామారావు జయంతిని సోమవారం పద్మనాయక కల్యాణమండపం హాల్ నెం-2లో నిర్వహించనున్నట్లు బోవేరా సంస్థల అధ్యక్షుడు బోయినపల్లి హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. గద్దర్‌కు మరణానంతరం ఆయన సతీమణి విమలా గద్దర్‌కు, తనయుడు సూర్యకిరణ్‌కు బోవేరా కవితా పురస్కారం ప్రదానం చేయనున్నామని తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

భగత్‌నగర్, ఆగస్టు 31: నగరంలోని రేకుర్తి 18వ డివిజన్‌లో శక్తి కేంద్రం ఇన్‌ఛార్జి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు కడారి మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

●నగరంలోని 59వ డివిజన్‌లో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, శక్తి కేంద్ర ఇన్‌ఛార్జి రెడ్డెడ్డి శ్రీనివాస్ (బాలు) ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు సమావేశం నిర్వహించారు.

కేంద్ర మంత్రికి వినతి

భగత్‌నగర్, ఆగస్టు 31: ఆర్ఎంపి పిఎంపిల మీద మెడికల్ కౌన్సిల్ అధికారుల రైడింగ్ ఆపాలని కొత్తపల్లి పట్టణ ప్రథమ చికిత్స వైద్యులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈకార్యక్ర మంలో కొత్తపల్లి పట్టణ ప్రథమ చికిత్స వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కొమ్ము గణేష్ పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 31: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. పోలీసు శాఖలో పనిచేసి పదవీ విరమణ చేసిన అధికారులకు శనివారం పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో శనివారం వీడ్కోలు పలికారు. కమిషనరేట్‌లోని వివిధ ప్రాంతాల్లో పనిచేసిన ఎస్ఐ జి.సాంబయ్య, ఏఎస్ఐలు అహ్మదుల్లాఖాన్, లక్ష్మారెడ్డి, కే పోచయ్య, హెడ్ కానిస్టేబుల్ డి.మల్లారెడ్డిలను అడిషనల్ డీసీపీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కుమారస్వామి, పోలీసు అసోసి యేషన్ అధ్యక్షులు ఎస్ఐ సురేందర్, ఆర్ఎస్ఐ తిరుపతి పాల్గొన్నారు.

నేడు తపస్ గురువందనం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 31: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో గత 25 సంవత్సరాలుగా ప్రతి యేటా నిర్వహిస్తున్నట్లుగానే ఆదివారం జిల్లాస్థాయిలో గురువందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్ట రాజేశ్వర్, అన్నమనేని తిరుపతిరావు ఒకప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ హాజరై పురస్కారాలను ప్రధానం చేస్తారని చెప్పారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 31: నియోజకవర్గానికి చెందిన పలువురు బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ కరీంనగర్‌లోని జ్యోతినగర్ కార్యాలయంలో శనివారం బాధితులకు అందజేశారు. కార్యక్ర మంలో ఆయా మండలాలబాధితుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెట్ జన్మదిన వేడుకలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 31: హైదరాబాద్‌లో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ జాతీయ పోటీల్లో విశేష ప్రతిభ చాటి బంగారు పతకాన్ని సాధించిన మాస్టర్స్ అథ్లెట్ మదుసూధన్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్, జిల్లా లింపిక్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్ష, కార్యదర్శులు రవేశ్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

రైతుల వివరాలు నమోదు

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలంలో రుణమాఫీ కాని రైతుల నిర్దారణ కార్యక్రమం చేపట్టగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మీ, ఏడీఏ రణదీర్ శనివారం పరిశీలించారు. దుర్శేడ్, నగునూర్ రైతు వేదికల్లో రుణమాఫీ కాని రైతుల కుటుంబ వివరాల నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయశాఖ అధికారి యం సత్యం, ఎఈఓలు చేపడుతుండగా ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు.

నేడు కలెక్టరేట్ ఎదుట నిరసన

జమ్మికుంట రూరల్, ఆగస్టు 31: యూపీఎస్ పెన్షన్ పథకానికి వ్యతిరేకంగా కరీంనగర్ కలెక్టర్ కార్యాలయం ఎదుట టీజేఏసీ ఆధ్వర్యంలో 1వ తేదీన చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి, జిల్లా కార్యదర్శి ఏబూషి శ్రీనివాస్ తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత

గంగాధర, ఆగస్టు31: గంగాధర మండలం కొండయ్యపల్లికి చెందిన మల్యాల రామస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా సమాజ సేవకుడు తూడి లచ్చయ్య రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

మున్నూరుకాపు సంఘం ఎన్నికలు

గంగాధర, ఆగస్టు31: గంగాధర మండలం కొండన్నపల్లి మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా రేండ్ల ఎల్లారెడ్డిని ఎన్నుకున్నారు. శనివారం గ్రామంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎల్లారెడ్డి, ప్రధానకార్యదర్శిగా కుంట శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా కుంట మల్లయ్యను ఎన్నుకున్నారు.

వైభవంగా శ్రీకృష్ణభగవాన్ ఊరేగింపు

హుజూరాబాద్, ఆగస్టు 31: హుజూరాబాద్ పట్టణంలో త్రైత సిద్ధాంత ప్రబోద సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో శనివారం శ్రీకృష్ణభగవాన్ ఊరేగింపు వైభవంగా జరిగింది. కార్యక్రమంలో సభ్యులు రవీందర్ రెడ్డి, శ్రీదేవి, రాంబాబు, సరిత, కుమారస్వామి ఉన్నారు.

బదిలీపై వచ్చిన ఉద్యోగులకు సన్మానం

రామడుగు, ఆగస్టు 31 : మండలానికి బదిలీపై వచ్చిన ఉద్యోగులను శనివారం కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. బదిలీపై వచ్చిన తహసీల్దార్, ఎంపీడీవో, ఈవో, పంచాయతీ రాజ్ ఏవో, గ్రామపంచాయతీ కార్యదర్శిలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మరవేణి తిరుపతి ముదిరాజ్, మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్, బీసీ సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులు సన్మానించారు.

● సంక్షిప్త సమాచారం..

● జమ్మికుంట రూరల్: జమ్మికుంట పట్టణంలోని శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో వాసవిక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు రవిచంద్రన్ ముఖ్య అథిగా హాజరయ్యారు.

● శంకరపట్నం: మొలంగూర్ గ్రామంలోని శ్రీభవానీ శంకర దేవాలయంలో శనివారం మాస శివరాత్రి శ్రావణ మాసం సందర్భంగా ఆలయ అర్చకుడు భంగిమఠం శివ ప్రసాద్ వేదమంత్రోచ్చరణలతో స్వామివారికి లక్ష బిల్వార్చన మహాపూజ నిర్వహించారు.

● చొప్పదండి: చొప్పదండిలోని శ్రీభక్త ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. శ్రీ జ్ఞాన సరస్వతి సేవాదళ్, శ్రీ హనుమాన్ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

● మానకొండూర్: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని గట్టుదుద్దెనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్ పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.